# తండ్రి మనసు

ఎవరైనా... బంగారమో... వండో... లేదూ స్థలమో... లేకపోతే సొంత ఇల్లో కుదువపెట్టి

అప్పు తీసుకోవటం ఇన్నేళ్లుగా ఎరుగుదును!. కానీ వీడేంటి... కన్నబిడ్డను... రెండేళ్లయినా నిండని ఆడప్లిని తాకట్టుపెట్టి అప్పు అడుగుతున్నాడు? ఇదేం అన్యాయం? ఇదెక్కడి ఘోరం?... కలికాలం కాకపోతే... బిడ్డనెవరైనా తాకట్టుపెడతామంటారా?... ఇదేదో... భారతంలో పంచపాడవుల్లో పెద్దవాడైనా ధర్మరాజు జూదం ఆడుతూ భార్య అయిన ద్రౌపదిని ఒడ్డినట్టు... వీడు రెండేళ్లపిల్లను తాకట్టుకు తేవటం చూచి మతి పోతోంది... పరిపరివిధాలుగ పాన్‌బ్రోకర్ యజమాని సేట్ లల్లూరాం మనసులో అనుకున్నవాడల్లా... అసలీపిల్లకు నువ్వు కన్నతండ్రివేనా? లేదూ ఎవరి బిడ్డనైనా దొంగిలించుకొచ్చి కుదవపెడుతున్నావా...?' నిలదీశాడు.

'అట్టా అనమాకు సేటూ!. ఇది నా కన్న కూతురు. సొంత బిడ్డ! ఎవరి బడ్డనో నేనెందుకు ఎత్తుకొచ్చి మీకాడ కుదువ పెడతానయ్యా?. అవనరం ప్రాణంమీదికొచ్చింది. పిల్ల తప్ప నాకాడేమీ లేదు. దీన్ని కని నాలుగు నెలలైనా తిరక్కుండానే దీని తల్లి సచ్చిపోనాది. అప్పట్నించీ నేనే సాకుతున్నా ! జాలిగొలుపుతూ చెపాపడు సైదులు.

'నువ్వు కన్నోడివా?... కసాయోడివవా? సొంత పిల్లనెవరైనా కువువపెడతారా?... అమ్ముకుంటారా?...' సేట్ నిశ్చేష్టుడైనాడు.

'నా కరమ అట్టా కాలింది సేటూ..'

'పీకలమీదకొచ్చిన అంత అవసరమేమిటీ?-' నిగ్గదీశాడు.

'సేటూ సిటీకి దూరంగ వుండే కాలనీకి అవతల వున్న ఖాళీ స్థలంలో బీదోళ్ల గుడిసెలేసుకుని కొన్నేళ్లగ బతుకుతావుండారు!...'

'సోది ఆపి అసలు పాయింట్‌కురా...' సేట్ గదమాయించాడు.

'నాపేరు సైదులయ్యా! మేం గుడిసెలేసుకున్న స్థలం యజమాని ఆజాగాలో ఫ్లాట్లు కడతాడంట. ఆడనుంచి మమ్మల్ని ఎల్లిపొమ్మాన్నాడు. మేం కాదు కూడదన్నాం!

బుల్‌డ్రౌజర్లు తెప్పించి మా గుడిసెలను నేలమట్టం చేయించాడు! మాకు నిలవ నీడ లేకుండా పోనాది సేటా. ఆడనుంచి మేమంతా చెట్టుకోపిట్టయినాం!. నాకిదొక్కతే పిల్ల. పెళ్లాం కాస్తా చచ్చిపోయె.... ఇంకో చోట స్థలంలో గుడిసె వేసుకోవాలనుకుంటే... ఎవరో బ్రోకర్లంట... వాళ్లొచ్చి మనిషికి అయిదు వేలిస్తే గుడుసె వేసుకోనిత్తానన్నాడు. కూలీనాలీ చేసుకుని గంజితాగెటోళ్లం... మాకాడ అంత ఇయ్యలేమని కాళ్ళా వేళ్లా పడినా జాలి చూపట్లేదు. బిడ్డను తాకట్టుపెట్టి అయినా సరే అప్పు తీసుకుని గుడుడిసేసుకుందామనే ఆశతో వచ్చినా సేటూ!- చూడు నాకూతురెంత సక్కంగవుందో? ఎర్రతోలు... కళగల మొమం... అంతా దాననమ్మ పోలికే!-' చెప్తూ ఆగాడు సైదులు.

అవును! సైదులు మాట నిజమే!. వాడికి పిట్టాల్సిన బిడ్డకాదు. బంగారు తునకలాగుంది. తనకా పిల్లల్లేరు పెళ్లై పదేళ్లయినా!... ఇంకా పుడతారే ఆశ లేదన్నారు డాక్టర్లు!. ఇప్పుడీ బిడ్డని తాకట్టు పెట్టుకిని సైదులుకు అప్పిస్తే... వాడంత డబ్బు తీర్చపోయినాడా...చచ్చాడు?- వడ్డీ కట్టలేక... అసలు తీర్చలేక బిడ్డని వదులుకోవటం ఖాయం!... సేట్ మనసు పరిపి విధాలుగ ఆలోచిస్తోంది.

సైదులు కళల నీళ్లు పెట్టుకున్నాడు.

పిల్లని తాకట్టుపెట్టుకున్నట్టు పోలీసులకు తెలిస్తే? అమ్మో... తనకు బేడీలు వేసి లాక్కెళ్లి లాకప్‌లోవేసి కుళ్లబొడవటం... శిక్షపడటం తప్పదు!. ఇప్పుడిదంతా తనకు వ్యాపారానికి అవసరమాన్పించింది.

పిల్ల ఇంకొంచెం పెద్దదై వున్నట్టయితే ఇంట్లో పని మనిషిగానైనా పనికొచ్చేది! రెండేళ్ల పిల్లదేనికి పనికొస్తుంది? దీనికి పట్టేపాలు.. పెట్టే తిండి అవసరమైన ఖర్చు!. కానీ పిల్ల రూపురేఖలు... పుట్టుక తీరు చూస్తుంటే వదలబుద్ధి కావటం లేదు. మరోవైపు భయం పీకుతోంది. ఇలాంటి క్లిష్టపరిస్థితిలో తానేమిటి చేయటమాని దీర్ఘంగ ఆలోచిస్తున్నాడు.

వీడిని చూడబోతే అప్పు ఇవ్వనిదే వదిలేట్టు కదిలేట్టులేడు. వాడిని కాకపోయినా వాడి చంకలోపిల్లను చూస్తుంటే జాలి అన్పిస్తోంది!.. మళ్లీ అంతలోనే... తాను చేసే వ్యాపారంలో జాలి... దయ... కరుణకు తావుండకూడదు. కఠినంగ వ్యవహరించి తెలివిగా ప్రవవర్తించకుంటే ఇబ్బందే అన్పించసాగింది.

కూడని పనిచేసి తానెందుకు ఇబ్బందులపాలు కావాలి?... ఏ నిర్ణయానికీ రాలేకపోతున్నాడు సేట్.

'ఇది నా కూతురేనయ్యా... కావాలంటే నాతో వచ్చిన ఈడిని అడగండి. వీడు నా బామ్మర్దే... ఎవరో కాదు. ఈడిపేరు ఓబులేసు బేల్దారు మేస్త్రీ పని చేస్తూంటాడు.' పక్కనున్న వాడిని సేట్ కు పరిచయం చేశాడు సైదులు.

'ఎలక్కు పిల్లి సాక్షమా?... నీవెంట వచ్చినోడు నీకు బావమరిదేనని సాక్ష్యం ఏది?... ఇది నీ కూతురని నమ్మేదెట్లా?' కాస్త మెత్తబడ్డట్టు మాట్లాడేడు సేట్.

'అట్టా అనమాకు సేటూ... అందరినీ అనుమానిస్తే ఎట్టా? నమ్మకమే మడిసిని బతికిస్తది! తాళికట్టిన ఆలిని కడుపున పుట్టిన బిడ్డనీ నమ్మకపోతే... మనం మడుసులమే కాదు...'

'నా వ్యాపారం పిల్లల్ని తాకట్టుపెట్టుకునేది కాదని నీకు తెలిసీ మొండికేస్తావేం సైదులూ?-' చిరాకు పడ్డాడు సేట్. ఈ పని డేంజరయ్యా చట్ట వప్పుకోదు... వెళ్లు... వెళ్లు...'

ఎంత చెప్పినా విన్పించుకోని సైదులు కాళ్లకు చుట్టుకున్న పామే అయినాడు. ఏదోవిధంగ వదిలించుకోక తప్పదన్పించింది. కూలీ చేసుకు బ్రతికే సైదులు లీగల్‌గ ప్రొసీడ్ కాగల ధైరం... తెగింపు వుండదన్పించింది. పోలీసులకు రిపోర్టివ్వగల తెలివీ వుండదు. ఇప్పుడు కాదూ కూడదని భయపడి వదులుకుంటే మళ్లీ కావాలన్నా ఇంతచక్కటి పిల్ల లక్షలు కుమ్మరించినా దొరక్కపోవచ్చన్పించింది.

ఎందుకైనా మంచిదని వందరూపాయల స్టాంప్ పేపర్ కొట్లో కుర్రాడితో తెప్పించి... ఇష్టపడే సైదులు తన కూతుర్ని తాకట్టుపెట్టి అప్పు తీసుకుంటున్నట్టు... నెలనెలా వడ్డీ చెల్లించకపోయినా... ఏడాదికాలంలో పిల్లను విడిపించి తిరిగి తీసుకెళ్లకపోయినా... కూతురు మీద హక్కుకోల్పోతాడనీ... పటిష్ఠంగ రాయించి సైదులుకు సంతకం చెయ్యటం రాదు కాబట్టి వేలిముద్ర వేయించుకుని వెంటవచ్చిన వాడితో సాక్షి సంతకం కింద వాడి వేలిముద్ర కూడా వేయించి పిల్లను తనపరం చేసుకున్న సేట్ మొత్తానికి అయిదువేలూ ఇచ్చి పంపించాడు.

అవసరానికి డబ్బు అప్పు దొరికినందుకు తెగ సంతోషించాడు సైదులు!... కూతురుని కుదువపెట్టి వెళ్లాల్సివచ్చిందనే బాధ మరోవైపు వేధిస్తూనే వుంది.

సైదులు, ఓబులేసు ఇద్దరూ నడుచుకుంటూ వెళ్లిపోగానే... కొట్లో గుమాస్తాకిచ్చి కుదువపెట్టుకున్న సైదులు రెండేళ్ల కూతురుని ఆటోలో తనింట్లో దిగవిడిచి రమ్మని చెప్పాడు.

గుమాస్తా ఆటో ఇంటికి చేరేలోపే భార్యతో వివరంగ ఫోన్ ద్వారా మాట్లాడేడు సేట్! ఫోన్ రిసీవర్ పెట్టేస్తూ హమ్మయ్య అనేసి గట్టి గాలి పీల్చి వదిలాడు. టెన్షన్ తగ్గినట్టన్పించింది. అంతా 'రాం రాం' దయ అనేసి మనసులో మురిసాడు. పిల్లేమో ముద్దుగ ముచ్చటగా వుండటంతో ఎప్పటికీ తనదగ్గరే వుంచుకోవాలని మనసులో సేట్ వుబలాటపడుతున్నాడు.

నాలుగైదు వీధులు దాటిన సైదులు ఓబులేసు ఇద్దరూ తిండికోసం హెూటల్లో దూరారు. కడుపునిండా బిర్యానీ మెక్కి బైటికి రాగానే...

'ఇదిగో నాతో నీకు పనైపోయింది. తిండి కూడా పెట్టిచ్చావ్. సేట్ రాయించిన స్టాంప్ పేపర్ మీద సాక్షి సంతకం కూడా పెట్టాను. నాదోవన నేనెళ్లిపోవాల... అవతల బోలెడు పన్లు నాకోసం ఎదురుచూస్తున్నయ్!... నా వాటా కూడా నాకిచ్చేస్తే మన బేరం సెటిలవుతుంది.'

ఆ మాటకు నివ్వెరపోయాడు సైదులు.

'వాటా ఏంది?... ఇచ్చేదేంది? నాతో వచ్చినందుకు బిర్యానీ పెట్టిచ్చానుగా... అదిచాలు!- నీ ముఖానికి పైసలు కూడా ఇయ్యాల్నా ఏంది... ఎల్లెల్లు... సన్నాసి ఎదవ కాకపోతే ఇంతసేపూ నాతోనే వున్నందుకు ఈ ఐదొందలు నీకాడ వుంచుకో నీ ఖర్చుకుంటది... ఓబులేసు చేతిలో పెట్టి మెడపట్టుకుని తోశాడు సైదులు.

'అమ్మనాకొడకా... కంత్రీ యవ్వారం చేసింది చాలక నెత్తిగారికి నాకు నామాలు పెడతావా?. నిన్నొదలనురా ఓరేయ్. నీ సంగతి చూస్తా... నీ అంతు తేలుస్తా...' పళ్లు కొరికాడు ఓబులేసు.

'తనఖా పెట్టింది నా కూతుర్నిరా! నీకిచ్చిందే ఎక్కువ!... పో.. ఎల్లిపో! నీ యదవ కూతలకు నేను భయపడే వాడినేం కాదు. ఏం చేసుకుంటావో సేస్కో!.నాతో పాటు నిన్ను సెల్లో పెట్టి వుతుకుతారు పోలీసోళ్లు. అది మర్చిపోమాకు.'

'అంతేనంటావా? ఇదే ఆఖరి మాటా?-' రెట్టించాడు ఓబులేసు.

నీ రుబాబు నాకాడకాదురోరే!. అమ్మ పుట్టిల్లు మేనమామకెరికే అన్నట్లు... నీయవ్వారం... బతుకు నాకు తెలవదా? నువ్కొతి ఫోర్ట్వంటీ గాడివి... పోరంబోకువి! - నా కూతుర్ని కుదవబెడతా అమ్ముకుంటా... నీకు దేనికిరా?... ఎగస్త్రాలు చేశావంటే సంపేత్తా!. ఒక్క సంతకానికి అయిదొందలిచ్చాను. అదే శానా ఎర్కవ! నువ్వేమైనా సుట్టానివా? స్నేహితుడివా?- సేట్ నమ్మకం కోసమని... బావమరిదని చెప్పానంతే! అంతమాత్రానికే సగం వాటా అడుగుతావంట్రా?. రిజిస్టారాఫీసుకాడ పదిరూపాయలిత్తే సంతకాలు పెట్టెటోళ్లు బోలెడుమంది వుంటారు... నీకు తెలవదేమా - నేనింకా మంచోడిని కాబట్టి పోన్లే పాపంగదాని అయిదొందలిచ్చాను...'

'అద్సరేగాని ఒరే.. ఆపిల్ల అసలు నీకూతురేనాని అనుమానంగ వుంది. యాడనుంచైనా ఎత్తుకొచ్చావేమోనే సగం వాటా అడిగాను. నిజం చెప్పరోరేయ్... ఓబులేసు సైదులుని నిలేసి నిగ్గదీసాడు.

'నోరు ముయ్యాసె! అవునో కాదో నీకేల? కూపీ లాగటానికి నువ్వేమైనా పోలీసోడివా?.. కోర్టులో వాదించే లాయరువా?... జడ్జీవా??... నోరుమూసుకుని ఇచ్చింది పట్టుకెల్లు...' చివరి మాటగ అన్నాడు సైదులు.

ఇంకా బెదిరించి లాభంలేదనుకున్నాడో ఏమో... చేతికొచ్చిందే దక్కుదల అనుకుని తనదారిన తాను వెళ్లిపోయాడు ఓబులేసు.

X X X

గెడిసెలో పిట్టు... మట్టిలో పెరిగిన పిల్ల వంటి కంపు వదిలించటానికి డెట్టాలు... లైఫ్‌బాయ్ సోపులతో స్నానం చేయించి షాంపూతో తలంటి వంటిన వున్న మకిల కంపు అంతాపోగొట్టారు సేట్ ఇంట్లో ఆడాళ్లంతా ఏకమై.

తర్వాత తలదువ్వి... శాండల్ పేపర్ వళ్లంతా పూశారు. పిల్లను ఘుమ ఘుమలాడేట్టు చేశారు. పిల్ల ఏడవకుండా... వేళకు పాలు పట్టి... పెరుగు బువ్వ తిన్పించి నిద్ర బుచ్చారు. షాపింగ్‌కెళ్లి అమ్మాయికి కొత్త గౌన్లు.. డ్రాయర్లు... డ్రస్సులు కొనుకొచ్చారు.

పిల్లను మాలిమి చేసుకుంటున్నారు. తండ్రి కోసం దిగులు పడకుండా అహర్నివలు చూచుకుంటున్నారు అంతా ఏకమై!. కొత్త మొహాలు చూచి మొదట్లో బిక్క ముఖం వేసినా బోలెడన్ని ఆట బొమ్మలు కొని ఆడించసాగారు. ఓ వారం

రోజుల్లో పిల్ల సేట్ ఫ్యామిలీ సభ్యులందరికీ దగ్గరైంది.

కొట్టుకు వెళ్లకుండా ఇంట్లోవున్న సమయమంతా పిల్లను ఎత్తుకు తిప్పుతున్నాడు సేటు! కిందకు దించటంలేదు. ఇప్పుడు పిల్ల శుభ్రంగ బంగారు కొండలావుంది. అచ్చగ తమకు పిట్టిన పిల్లలాగే అన్పిస్తున్నందుకు సేట్ తెగ సంబరపడుతున్నాడు.

ఈ బంధం శాశ్వతమైతే బాగుండు మళ్లీ ఈ పిల్లను ఆ ఓబులేసుగాడు వచ్చి తిరిగి తీసుకెళ్లకూడదని దేవుళ్లందరికీ సేట్ మొక్కుతున్నాడు. మార్వాడీ సా&ంప్రదాయం ప్రకారమే పెంచుతున్నారు పిల్లను.

తమ భాషే నేర్పుతున్నారు. ఇంతటి చక్కదనాలపిల్ల గుడిసెలో వుండేవాడికి పట్టటేమిటని ఆశ్చర్యపోని రోజులేదు. సేట్ పంచప్రాణాలు పిల్లమీదే!.

పిల్లను తాకట్టుపెట్టి డబ్బు తీసుకెళ్లాక మళ్లీ సేట్‌కు ముఖం చూపించనేలేదు. నెలనెలా వడ్డీ కట్టటం లేదు. ఇలాంటి వాడు తన కూతుర్నేం వెనక్కి తీసుకెళతాడే?... అని చాలాసార్లు మనసులో అనుకున్నాడు సేట్. కానీ ఎప్పటికైనా రాకపోడు. అప్పుడైనా వాడి కూతుర్ని వాడికిచ్చేయక తప్పదు. ఎంత ప్రేమతో గారాబంగ ముద్దుచేసి పెంచినా... ఎవరు కన్న పిల్లో తన సొంతం కాదు కదా? అన్పించేది సేట్‌కి చాలాసార్లు.

సైదులు కూతురుని కుదువపెట్టిన డబ్బుతో సొంతంగ గుడిసె వేసుకునేటందుకు ఖర్చు చెయ్యనే లేదు. పెళ్లామా చచ్చిపోయె... కూతురేమో దగ్గరలేకపోయె... ఒంటరివాడైన తనకు ఇంకా సొంత గుడిసె దేనికన్పించింది. పనేదీ దొరక్కపోవటంతో అప్పుతెచ్చిన డబ్బంతా హారతికర్పూరంలా ఖర్చు అవుతూనే వుంది.

తనకు శానా ఏళ్ళుగ పరిచయమున్న రామయ్య ఇంట్లోనే వుంటూ డబ్బులిచ్చి అక్కడే భోజనం చేస్తున్నాడు.

'నీ కూతురేమాయెరా సైదులూ' అని కొత్తల్లో రామయ్య అడిగిన ప్రశ్నకు... బందువులిటికాడ దిగబెట్టి వచ్చినా... నేనా పిల్లనేడ పెంచేది?...' అని అబద్ధం చెప్పి బాధపడ్డాడు.

కానీ... కన్నకూతురు కళ్లల్లో మెదలాడుతునేవుంది. రాత్రిల్లు కలలోకొస్తునేవుంది! అదెట్టావుందో.. ఏమో?... బెంగపెట్టుకుందేమో... వేలకు పాలుతాగుతుందో... బువ్వతింటున్నదో మొండికేస్తోందో అన్పించేది.

సేట్ బాగా డబ్బున్నవాడు కాబట్టి పెంచటంలో పల్లకేలోటు రానీడు!. తనేమో అప్పు తీర్చే సంగతెలా వున్నా.. నెలనెలా వడ్డీ కూడా చెల్లించే స్థితిలో లేడాయె... ఇట్టాగైతే తనబిడ్డను తాను ఎప్పటికీ వెనక్కు తెచ్చుకోలేడా?. వాళ్ల పిల్ల అయిపోతుందా దిగులు మరోవైపు సైదులును కుదిపేస్తోంది.

X X X

కన్నబిడ్డను చూడాలని మనసు తహతహలాడటంతో సేట్ ఇంటికి లాడటంతో సేట్ ఇంటికి బయల్దేరాడు సైదులు. ఎట్టాగైనా సరే వాళ్లకు తెలీకుండా పల్లను ఎత్తుకొచ్చేయాల్సిందే...

సేట్ ఇంటిముందున్న ఖాళీసంథలంలో పల్ల ఆడుకోవటం చూచి గుర్తించాడు. నతబిడ్డేనని! అబ్బ ఎంత ముద్దొస్తోందో!... చేతులకు బంగారు మురుగులు... కాళ్లకు గజ్జెల పట్టీలు... మెళ్లో బంగారు గొలుసు... వంటిన గౌనుతో ధగధగ మెరిసిపోవటం కళ్లారా చూస్తూ మురిసాడు సైదులు. పిల్లను చూచేందుకు రెండు కళ్లూ చాలటంలేదన్పించింది.

ఇలా సుఖంగ పెరుగుతున్న బిడ్డను తాను కాజేసుకుపోవటమా? - కడుపునిండా బువ్వయినా పెట్టలేని బ్రతుకు తనది. అలాంటప్పుడు ఎత్తుకెల్లి ఏం చేయగలడు? కిచకిచమంటూ  చప్పుడు చేస్తున్న కాలిబూట్లకు తనకాడికి వస్తే మళ్లీ మట్టి అంలటకమానదు.

తనవద్ద బిడ్డ సుఖపడలేదు. సేట్ కాడవుండటమే అన్నివిధాల మంచిదనే నిర్ణయానికొచ్చిన సైదులు... పిల్లపట్ల తనలోగల ప్రేమానురాగాలను మనసులోనే బలవంతాన అణుచుకుని వెనుదిరిగి గుడిసెదారి పట్టాడు. దు:ఖాన్ని దిగమింగాడు. పిల్ల సుఖాన్నే తండ్రిగా తాను కోరుకున్నాడు.

---సమాప్తం---